పోలీస్ సేవలకు పురస్కారం

- జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందడం గర్వకారణం
- అధికారులకు అవార్డులు అందజేసిన డీజీపీ గౌతమ్ సవాంగ్

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రజలకు విశేషమైన, విశిష్టమైన సేవలు అందిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పురస్కారాలు అందజేయడం సంతోషకరమని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గౌతమ్ సవాంగ్ అన్నారు. మంగళగిరిలోని ఏపీ పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం అత్యుత్తమ దర్యాప్తు చేసిన వారికి అందించే ఏబీసీడీ అవార్డులతో పోలీస్ అధికారులు, సిబ్బందిని డీజీపీ సత్కరించారు. ఈ సందర్భంగా సవాంగ్ మాట్లాడుతూ దశాబ్దాల రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏపీ పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలకు ప్రధానమంత్రి ప్రశంసలను అందుకున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని సాంకేతిక పరిజ్ఞానంతో పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నామని చెప్పారు. ఈ ఏడాదిలో జాతీయ స్థాయిలో 26 సాంకేతిక అవార్డులను ఏపీ పోలీస్ అందుకుందన్నారు. అత్యుత్తమ దర్యాప్తు చేసిన పోలీసులకు అందించే ఏబీసీడీ అవార్డుల్లో మొదటి బహుమతిగా రూ. లక్ష, రెండో బహుమతిగా రూ. 60 వేలు, మూడో బహుమతిగా రూ. 40 వేలతోపాటు అన్నింటికీ ప్రశంసాపత్రాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఏటా నాలుగు భాగాలుగా ఇచ్చే ఈ పురస్కారాల్లో 2019లో మూడు, నాలుగు, 2020 మొదటిభాగానికి సంబంధించి 103 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి అవార్డులు అందజేశామని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించి నేర పరిశోధన చేసి, నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన ఉత్తమ పీసీఆర్ అవార్డును డీఎస్పీ కె. సుప్రజకు అందజేసి అభినందించారు. అలాగే వివిధ జిల్లాల్లో ఉత్తమ సేవలందించిన మరో 103 మందికి పలు రకాల పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రైల్వేస్ డీజీ, సీఐడీ అదనపు డీజీపీ ద్వారకా తిరుమలరావు, లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్, రోడ్ సేఫ్టీ అదనపు డీజీపీ ఉజాలా త్రిపాఠి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సామాజిక సంక్షేమంలోకి! 2 బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలు

- అనుసంధానంతో ప్రయోజనం

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ అందించే రెండు కీలక పథకాలను ప్రభుత్వం సామాజిక సంక్షేమ పథకాల్లో కలిపేసింది. ప్రభుత్వ నిర్ణయంతో గతం కంటే లబ్దిదారులకు అధిక ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో..బ్రాహ్మణ కార్పొరేషన్ అందించే కీలక పథకాలైన పెన్షన్లు, విద్య వంటివి సామాజిక సంక్షేమానికి అనుసంధానం చేస్తున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ నుంచి ప్రత్యేక పథకాల కింద వృద్ధులు, విద్యార్థులు లబ్దిపొందేవారు. అప్పటితో పోల్చితే ప్రభుత్వం ఇప్పుడిస్తున్న పథకాల వలనే ప్రయోజనం ఎక్కువగా ఉందని లబ్దిదారులు చెపుతున్నారు. దీంతో ఇతర పథకాలతో కలిపి ఇస్తున్నప్పటికీ ఏ ఒక్కరూ అభ్యంతరం వ్యక్తం చేయడం లేదు. రాష్ట్రంలో 2014లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. వృద్ధులకు పెన్షన్లు ఇచ్చేందుకు 'కశ్యప' పథకం, ఒకటో తరగతి నుంచి ఉన్నత విద్య వరకు చదివే విద్యార్థుల కోసం 'విద్యా భారతి' పథకాలను బ్రాహ్మణ కార్పొరేషన్ అమలు చేస్తోంది.

కశ్యప పథకం కింద వృద్ధ బ్రాహ్మణులకు నెలకు రూ.2వేల పెన్షన్ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అందజేసేవారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 26వేల మంది లబ్దిపొందుతున్నారు. కార్పొరేషన్ నుంచి నేరుగా ఆయా వృద్ధుల బ్యాంకు ఖాతాల్లోకి పెన్షన్ సొమ్ము జమ చేసేవారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ అందితేనే వీరికి పెన్షన్లు వచ్చేవి. కొన్ని సందర్భాల్లో బడ్జెట్ విడుదల లో జాప్యం జరిగి మూడు నాలుగు నెలల వరకు పెన్షన్లు పెండింగ్ ఉన్న సందర్భాలు ఉన్నాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారం లోకి వచ్చిన తర్వాత అమలులోకి వచ్చిన వాలంటీర్ల వ్యవస్థ వలన సామాజిక పెన్షన్లను నేరుగా ఇంటి వద్దనే అందజేస్తున్నారు. గతంలో మాదిరి గంటల తరబడి పెన్షన్ల కోసం వృద్ధులు ఎదురు చూసే పరిస్థితులు లేవు. ఈ క్రమంలోనే బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అందించే కశ్యప పెన్షన్లను కూడా సామాజిక పెన్షన్లలో విలీనం చేశారు. దీంతో వీరికి అదనంగా రూ.250 కలిసొచ్చింది. ప్రతి ఏటా రూ.250 చొప్పున పెరిగే అవకాశం ఉండటంతో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా లబ్దిపొందే వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మఒడి బెటర్

విద్యా భారతి పథకంతో పోల్చితే అమ్మఒడి పథకం బ్రాహ్మణ విద్యార్థులకు లాభదాయకంగా ఉంది. సుమారు 22వేల మంది బ్రాహ్మణ విద్యార్థులు విద్యా భారతి పథకం కింద ప్రయోజనం పొందుతున్నారు. విద్యా భారతి పథకంలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఏడాదికి రూ.5వేలు, ఆపైన చదివే వారికి తరగతిని బట్టి ఏడాదికి రూ.9వేల వరకు ఇచ్చే వారు. ఇదే కాకుండా ఉన్నత విద్యకు రూ.20వేల వరకు, విదేశీ విద్యకు రూ.10లక్షల వరకు బ్రాహ్మణ కార్పొరేషన్ నుంచి ఆర్థిక సాయం అందజేసేవారు.

ఇప్పుడు విద్యాభారతి పథకం స్థానంలో ఇంటర్ వరకు అమ్మఒడి పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద వీరికి ఏటా రూ.15వేలను ప్రభుత్వం ఇస్తుంది. ఆపై తరగతులు చదివే వారికి విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెపుతున్నారు. అమ్మఒడి, విద్యా భారతి పథకాల నిబంధనలు వేర్వేరుగా ఉండటంతో ఇటీవల ఆరువేల మంది విద్యార్థులకు కొంత ఇబ్బంది ఎదురైంది. దీంతో ప్రభుత్వం ఆటంకంగా మారిన నిబంధనలు సవరించి మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో పలువురు విద్యార్థులు రెండోసారి దరఖాస్తు చేసుకున్నారు. విదేశీ విద్యకు సంబంధించి ఇతర కార్పొరేషన్లకు సైతం బడ్జెట్ విడుదల కాలేదని కార్పొరేషన్ వర్గాల సమాచారం.

నాలుగు రోజులు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడనం

అమరావతి, ఆంధ్రప్రభ : వాయువ్య బంగాళాఖాతం, పరిసర ప్రాంతాల్లో గురువారం అల్పపీడనం ఏర్పడనుంది. అల్పపీడన ప్రభావంతో రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ ప్రభావంతో రానున్న నాలుగురోజుల్లో విశాఖ. ఉభయ గోదావరి జిల్లాల్లో, యానాం, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని జిల్లాల్లో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, సముద్రపు అలలు మూడు నుంచి 3.5 కిలోమీటర్ల ఎత్తువరకు ఎగసిపడే అవకాశం ఉన్నందున, సముద్రం అలజడిగా ఉండే పరిస్థితుల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ కె కన్నబాబు తెలిపారు.

వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థి పెన్మత్స నామినేషన్ దాఖలు నేడు

అమరావతి, ఆంధ్రప్రభ : వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన పెన్మత్స సురేష్ గురువారం అసెంబ్లీలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నెల 6న ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా నామినేషన్ల స్వీకరణకు 13వ తేదీ చివరి రోజు అయితే బుధవారం వరకు నామినేషన్లు దాఖలు కాలేదు. వైకాపా అభ్యర్థిగా పెన్మత్సను మంగళవారం సాయంత్రం పార్టీ అధినేత జగన్ ప్రకటించారు. అనంతరం బుధవారం నామినేషన్‌కు సంబంధించిన పత్రాలను అసెంబ్లీ నుంచి తీసుకోవడం జరిగింది. దీంతో సురేష్ బాబు గడువు చివరి రోజు నామినేషన్ ప్రతాలను దాఖలు చేయనున్నారు. ఈ నెల 24న ఎన్నిక జరగనుంది. కాగా ఈ ఎన్నికలలో తెదేపా బరిలో నిలిచే అవకాశం కూడా లేనందున సురేష్ ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది. ఎమ్మెల్యే కోటాకు సంబంధించిన ఈ స్థానం సంఖ్యాపరంగా వైకాపాకే దక్కనుంది.

బాబు ఎజెండాను అమలు చేస్తున్న హర్షకుమార్

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

అమరావతి, ఆంధ్రప్రభ : తెదేపా అధినేత చంద్రబాబు సీక్రెట్ ఎజెండాను మాజీ ఎంపీ హర్షకుమార్ అమలుచేస్తున్నారంటూ సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు అజెండాను దళిత మాస్కును కప్పుకుని హర్షకుమార్ ముందుకెళ్తున్నారంటూ ధ్వజమెత్తారు. అమరావతి రాజధానికి, దళితులకు సంబంధం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. 87 శాతం ప్రజలు సీఎం జగన్ ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని చెప్పారు. దళితులపై ఏమైనా జరిగితే జగన్ స్పందించిన తీరున దేశంలో ఎక్కడైనా, ఎవరైనా స్పందిస్తున్నారా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే ఎంతటివారికైనా జైలే అని నిరూపించామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి దయ వల్లే హర్షకుమార్ రెండుసార్లు ఎంపీగా పనిచేసే అవకాశం దక్కిందన్నది మరచి పోయి ప్రవర్తించడం దారుణమన్నారు.

ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారు



అమరావతి, ఆంధ్రప్రభ: రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ దేశ పౌరులకు ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఏపీలో కాలరాస్తున్నారని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఈ మేరకు బుధవారం చేసిన ట్వీట్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయ దళిత విద్యార్థి, రిసెర్చి స్కాలర్ ఆరేటి మహేష్ ఉన్నత చదువులకు ఆటంకాలు కల్పించడం విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. దళితుల చదువుకు అడ్డుపడటం, వైద్యులపై అవమాన షాలు, న్యాయమూర్తులపై దాడులు, ఆడబిడ్డలపై అత్యాచారాలు, భూములు లాక్కోవడం వంటి చర్యలను దళిత సమాజం నిలదీయాలన్నారు. నిరాహార దీక్షచేస్తున్న మహేష్‌కు తక్షణమే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే యువశక్తికి అంతర్జాతీయ యువజనోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నానని చంద్రబాబు మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో యువత భవిష్యత్తుపై భరోసా లేని పరిస్థితుల్లో ఉండటం బాధాకరమన్నారు.

జూనియర్ డాక్టర్ల స్టైఫండ్ పెంపు

- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో జూనియర్ డాక్టర్ల స్టైఫండ్ మొత్తాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి జారీ చేశారు. ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు ఇప్పటి వరకు రూ. 15 వేల 817 స్టైఫండ్ ఉండగా.. దాన్ని రూ. 19 వేల 589కి పెంచారు. అలాగే పీజీ డిగ్రీ విద్యార్థులకు మొదటి సంవత్సరానికి రూ. 35 వేల 589 ఉన్న మొత్తాన్ని రూ. 44 వేల 75కు పెంచారు. రెండో సంవత్సరానికి రూ. 37 వేల 566 ఉండగా.. రూ. 46 వేల 524, మూడో సంవత్సరానికి రూ. 39 వేల 543 ఉన్న మొత్తాన్ని రూ. 48 వేల 973కి పెంచుతున్నట్లు పేర్కొన్నారు. పీజీ డిప్లొమా మొదటి ఏడాదికి రూ. 35 వేల 589 నుంచి రూ. 44 వేల 75కు, రెండో ఏడాదికి రూ. 37 వేల 566 ఉండగా.. రూ. 46 వేల 524కు పెంచారు. సూపర్ స్పెషాలిటీకి సంబంధించి మూడేళ్లు వరుసగా.. రూ. 39, 543, రూ. 41, 521, రూ. 43, 497 ఉండగా.. వాటిని రూ. 48, 973, రూ. 51, 422, రూ. 53, 869కి పెంపుదల చేశారు. అదే విధంగా ఎండీఎస్ విద్యార్థులకు మూడేళ్లు వరుసగా.. రూ. 35, 589, రూ. 37, 566, రూ. 39, 543 ఉన్న స్టైఫండ్ మొత్తాలను రూ. 44, 075, రూ. 46, 524, రూ. 48, 973కు పెంచారు.

ఏనుగుల సంరక్షణకు అన్ని చర్యలు

- అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి ప్రతీప్ కుమార్

అమరావతి, ఆంధ్రప్రభ : ఏనుగులను సంరక్షించుటకు రాష్ట్ర అటవీశాఖ పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతుందని అటవీశాఖ ప్రధాన ముఖ్య సంరక్షణాధికారి ఎన్ ప్రతీప్ కుమార్ చెప్పారు. ప్రపంచ ఎలిఫెంట్ డే సందర్భంగా అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన వెబ్ సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏనుగు భారతదేశం గర్వించదగ్గ జంతువని, దేశ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని చెప్పారు. ప్రకృతిలో ఇతర జంతువుల రక్షణకు ఏనుగులు అండగా ఉంటాయన్నారు. ఉన్న ఏనుగులను కాపాడుకోవడంతోపాటు, ఏనుగుల సంతతిని పెంచడానికి ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ సిబ్బంది చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. మానవాళి మనుగడకు ఏనుగుతోపాటు ప్రతి జంతువునూ సంరక్షించుకోవాలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకునివచ్చి వన్యప్రాణుల క్రైం రేటును తగ్గించడానికి అటవీశాఖ కృషి చేస్తుందని తెలిపారు. ప్రొటక్ట్ నేషనల్ హెరిటేజ్ యానిమల్ నినాదంతో తమ సిబ్బంది పనిచేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణా రెండూ ముఖ్యమేనని తెలిపారు. సంరక్షణలో బంధించబడిన ఏనుగులు, అటవీ ఏనుగులకు మరింత మెరుగైన నిర్వహణకు సంబంధించి అనువైన మార్గాలను, పరిజ్ఞానాన్ని అందరికీ తెలియజేయడమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశ్యమన్నారు. ఏపీలో సుమారు 60 నుండి 70 ఏనుగులు ఉన్నాయన్నారు.

ఏనుగుల సంరక్షణలో ప్రధానంగా వాటి సహజ ఆవాసాలు క్షీణించడం, చెల్లాచెదురు అవ్వడం, తగ్గిపోవడం, వాటి దంతాల కోసం వేటాడటం మరియు మానవ, ఏనుగుల సంఘర్షణ వంటి ముఖ్య అవరోధాలుగా ఉన్నాయని తెలిపారు. మానవ, ఏనుగుల మధ్య సంఘర్షణను నివారించేందుకు ఏపీ అటవీశాఖ కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో ప్రధానంగా అటవీ ప్రాంతాల్లో నీటిని అందించేందుకు నీటి గుంటలు తవ్వడం, సరిహద్దు చుట్టూ ఎలిఫెంట్ ప్రూఫ్ కందకాలు తవ్వటం, అవసరమైన ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, ఎలిఫెంట్ ట్రాక్టర్లు నియమించడం ద్వారా వాటి కదలికలను నిఘా ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. 2014 నుండి 2020 వరకూ ఏనుగుల వలన జరిగిన పంట నష్టం, గాయాలు అవ్వడం సంఘనల్లో నష్టపరిహారం నిమిత్తం రూ. 448.33 లక్షల రూపాయాలు ఇచ్చామని, అలాగే ఏనుగుల దాడిలో చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా కింద రూ. 60 లక్షలు చెల్లించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అటవీశాఖ అధికారులతోపాటు పలు వన్యప్రాణి సంరక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీమలిఫ్ట్‌పై తీర్పు రిజర్వు

- కేంద్ర పర్యావరణ శాఖకు ఎన్‌జీటీ నోటీసులు
- తమ వైఖరి ఏంటో వారం రోజుల్లో చెప్పాలని ఆదేశం
- ఎత్తిపోతల పథకం పాతదేనన్న ఏపీ
- వాటా నీళ్లనే తీసుకుంటున్నామన్న ప్రభుత్వ న్యాయవాది

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాయలసీమ ఎత్తిపోతల పథకంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై ధర్మాసనం వెల్లడించింది. తెలంగాణకు చెందిన శ్రీనివాస్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై ధర్మాసనం విచారించింది. రాయలసీమ ఎత్తిపోతల పథకంలో కొత్త భాగాలు చేర్చారని పిటీషనర్ తరుపు న్యాయవాది వాదించారు. 40వేల క్యూసెక్కుల సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచారని పిటీషనర్ తరుపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. రోజుకు 8 టీఎంసీల నీటిని తరలించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని మార్చిందని పిటీషనర్ కోర్టుకు తెలిపారు.

కాగా... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇచ్చిన సమాచారంతో కమిటీలోపభూయిష్టంగా నివేదిక తయారు చేసిందని పిటీషనర్ తరపు న్యాయవాది చెప్పారు. అయితే రాయలసీమ ఎత్తిపోతల పథకం పాతదేనని విచారణకు హాజరైన ఏపీ ప్రభుత్వం తరుపు న్యాయవాది ధర్మాసనం ముందు వాదించారు. తమకు రావాల్సిన వాటా నీళ్లనే తీసుకుంటున్నామని

ఆయన స్పష్టం చేశారు. కమిటీ నివేదిక ఏపీకి అనుకూలంగా ఉన్నందున కేసును ముగించాలని ఏపీ ప్రభుత్వం కోరింది. ఏపీ ప్రభుత్వం చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని కౌంటర్ అఫిడవిట్ ద్వారా రోజుకు 40వేల క్యూసెక్కుల సామర్థ్యాన్ని 80వేల క్యూసెక్కులకు పెంచితే తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ ట్రిబ్యునల్‌కు వివరించింది. తమ వైఖరి ఏంటో వారం రోజుల్లో తెలియజేయాలని కేంద్ర పర్యావరణశాఖకు ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ఎన్‌జీటీ చెన్నై ధర్మాసనం స్పష్టం చేసింది.

37 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో 37 మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు, బదిలీలు కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న కిడారి సందీప్‌కుమార్ కేఆర్ పురం ట్రైబల్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, ఎం వెంకటేశ్వరరావును రంపచోడవరం ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, టీ చిరంజీవిని సీఆర్డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, కే ఝాన్సీలక్ష్మి విజయ వాడ ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ కమిషనర్‌గా నియమితులయ్యారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న కేవినాయకం ప్రకాశం జిల్లా డీఆర్‌ఓగా ఏలూరు డెవలప్‌మెంట్ అథారిటీ కార్య దర్శి ఎండీ ఝాన్సీ లక్ష్మి పశ్చిమగోదావరి జిల్లా ఐసీడీ ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా, కర్నూలు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ జీ విజయలక్ష్మి తిరుపతి ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. పశ్చిమగో దావరి జిల్లాలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కేవరిశంకర్‌ను మచిలీపట్నం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ఎస్‌డీసీగా కృష్ణాజిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న ఏ ప్రసాద్ విశాఖపట్నం డీఆర్‌ఓగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న ఎం శ్రీదేవిని నెల్లూరు సివిల్ సప్లయిస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, నెల్లూరులో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో పనిచేస్తున్న జీ గంగాధర్ గౌడ్ అనంతపురం జేసీగా, పీధర్మచంద్రారెడ్డికి కడప జేసీగా పోస్టింగ్ కల్పించారు. సీఆర్డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న టీ కృష్ణ భవానీ నెల్లూరు జేసీ (ఆసరా, వెల్ఫేర్)కు, నెల్లూరు మునిసిపల్ కమిషనర్ టీ బాపిరెడ్డిని ప్రకాశం జిల్లా జేసీగా నియమించారు. నెల్లూరు బీసీ కార్పొరేషన్ ఈడీ టీ రాజగోపాల్ కడప జీఎన్ఎస్ఎస్ ఎస్డీసీగా ఏపీఐఐసీ ఓఎస్‌డీ కే చంద్రశేఖర్ ఏపీఎస్ డీఎంఏ ఈడీగా, నూజివీడు ఆర్డీఓ భవానీశంకర్ విజయనగరం ఆర్డీఓగా, విజయ నగరం డీఆర్వోగా పనిచేస్తున్న జే వెంకట్రావును అదే జిల్లా జేసీ(ఆసరా, వెల్ఫేర్)లో పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం అక్కడ జేసీగా పనిచేస్తున్న ఆర్ కూర్మనాథ్‌ను పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా నియమితు లయ్యారు. కొవ్వాడ రణస్థలిపురం భూ సేకరణ ఎస్డీసీగా పనిచేస్తున్న ఎం గణపతిరావును విజయ నగరం డీఆర్వోగా, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న పీ శేషశైలజకు శ్రీకాకుళం జిల్లా పౌరసరఫరాలశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, ఎం గోవిందరాజులుకు కొవ్వాడ రణస్థలిపురం ఎన్‌పీపీ (భూసేకరణ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. గుంటూరు స్టెప్ సీఈఓగా పనిచేస్తున్న ఎస్ శివయ్య అమరావతి- అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే ఎస్డీసీగా వెయిటింగ్‌లో ఉన్న ఏ మలోలా కడప డీఆర్వోగా, మదనపల్లి ఆర్డీఓ ఎంఎస్ మురళి చిత్తూరు డీఆర్డీఏ పీడీగా, తెలుగు గంగ ప్రాజెక్ట్ ఎస్‌డీసీగా పనిచేస్తున్న కే వెంకటరెడ్డిని కదిరీ ఆర్డీవోగా బదలీ చేశారు.

ఆన్‌లైన్ లావాదేశీలపై అప్రమత్తం

- సీఐడీ వెబినార్‌లో ఉన్నతాధికారులు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆన్‌లైన్‌లో లావాదేవీలు జరిపేవారు అప్రమత్తం గా ఉండాలని సీబీఐ అధికారి పి. విమల్ ఆదిత్య హెచ్చరించారు. ఏపీ పోలీస్, సైబర్ పీస్ ఫౌండేషన్‌తో సంయుక్తంగా సీఐడీ ఈ-రక్షా బంధన్‌లో భాగంగా బుధ వారం 'ఆన్‌లైన్ లావాదేవీలు- భద్రతపై వెబినార్ నిర్వహించి జాగ్రత్తలు చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీ రాజ్ శాఖ
ఇ-ప్రొక్యూరిమెంట్ టెండరు ప్రకటన
టెండరు నోటీస్ నెం.టి.ఓ/1 టు 3 తేది: 06-08-2020
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు డివిజను నందు 3 అసంపూర్తి స్త్రీ శక్తి భవనములు పూర్తి నిర్మాణము కొరకు అంచనా విలువ మొత్తము రూ.22.75 లక్షలతో పనులు చేపట్టుట కొరకు నమోదిత సంస్థలు మరియు కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. పై పనులకు ఇ-ప్రొక్యూర్మెంట్ పోర్టల్ ఫారంలో టెండరు డాక్యుమెంట్లు లభ్యత 17-08-2020 మ॥3.00గం.ల నుండి 31-08-2020 మ॥3.00గం.ల వరకు, సాంకేతిక బిడ్ తెరచు తేది: 31-08-2020 సా॥4.00గం.లకు, ఆర్థిక బిడ్ తెరచు తేది: 31-08-2020 సా॥5.00గం.లకు, తదుపరి వివరాలను దిగువ సంతకందారు కార్యాలయం నుండి పొందవచ్చును. ఫోన్ నెం. 08624- 251461. సం/- కార్యనిర్వాహక ఇంజనీర్ (ఎఫ్ఎస్), పి.ఆర్.ఐ. డివిజన్, గూడూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
Ro.No.716/CL/Advt/1/1/2020-21, Dt: 12.08.2020

టీడీపీ ఆందోళనలు

- 65 నియోజకవర్గ కేంద్రాలు, 132 మండల కేంద్రాల్లో నిరసనలు
- అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు అందజేత

అమరావతి, ఆంధ్రప్రభ : దళితులపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, తప్పుడు కేసులకు నిరసనగా టీడీపీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా బుధవారం 13 జిల్లాల్లో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా 65 నియోజకవర్గ కేంద్రాలు, 132 మండల కేంద్రాల్లో జరిగిన ఆందోళనా కార్యక్రమాల్లో దాదాపు 2 వేల మంది నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. భారతరాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పాలాభిషేకాలు చేయడంతోపాటు విన